

# మార్పు తెచ్చిన మనిషి (4)

గొప్ప కవిత్వం వ్రాసినవాడి గుండెలో ఏదో గాయం వుండి వుండాలని ఇటీవల స్వర్గస్థుడైన సోమర్సెట్ మామ్ ఒకసారి అన్నాడు.

ఆధునిక మానవుడి హృదయానికి తగిలిన గాయాలను గేయాలుగా వ్రాసిన కవి శ్రీరంగం శ్రీనివాసరావు.

ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు—ఈ మూడింటిని మనవారు 'ప్రస్థానత్రయం' అన్నారు. 'మహాప్రస్థానం' కూడా చేరిస్తే అది 'ప్రస్థాన చతుష్కం' అవుతుందని అనేవారు చాలామంది ఉన్నారు.

శ్రీ శ్రీ ఏం రాశాడు? రష్యా భజన చేశాడు. షాక్ చెయ్యడానికి రాశాడు. పొగగొట్టపు ఘీంకార ధ్వని, రాంబందుల రెక్కల చప్పుడు తప్ప అతని కవిత్వంలో మరేం లేదు; అనేవాళ్ళూ వున్నారు.

శ్రీ శ్రీ కవిత్వం అసలు నచ్చని వాళ్ళూ వున్నారు. వడ్డీతో సహా అంతా నచ్చినవాళ్ళూ వున్నారు.

కాని, ఒకటి మాత్రం నిజం. శ్రీ శ్రీ రాజకీయాలని అరాజకీయాలుగా కొట్టేసేవాళ్ళు కూడా అతని శబ్దాల ప్రాబల్యాన్ని, భావాల శాబల్యాన్ని అంగీకరిస్తారు. 'ఫరవా

లేదు, బాగానే రాస్తాడని పూరు కోవడానికి వీల్లేని కవి శ్రీ శ్రీ.

నిజం కమ్యూనిజంలోనే ఉందని నమ్మిన మొదటి తెలుగు వారిలో శ్రీశ్రీ ఒకడు. 1934 ప్రాంతాలకే ఆయన "మరో ప్రపంచం" పిలుపు విన్నాడు. అక్కడికి పోదామని తోటివారిని చేతనైనంత ఆవేశంతో, ఆవేదనతో పురికొల్పాడు.

విప్లవానికి జగన్నాథ రథచక్రాలతో పోలిక తెచ్చిన మొదటి రచయిత తుర్గెనీవ్ ("వర్జిన్ సాయిల్" నవలలో).

శ్రీ శ్రీ ఆ రథచక్రాలను ఆకాశపు దారుల్నించి భూమార్గం పట్టిస్తానని, భూకంపం పుట్టిస్తానని వాగ్దానం చేశాడు.

ఈ వాగ్దానం మాట ప్రస్తుతం మరచిపోయాడో ఏమోగాని, ఇతర భాషా చలన చిత్రాలకు తెలుగు "వాక్" దానం మాత్రం ఆయన చేస్తున్నాడు

శ్రీ శ్రీ మీద లెక్కలేనన్ని ప్రభావాలున్నాయి. ప్రాచీనాంధ్ర కవుల శబ్దశక్తి అతనిలో వుంది; నవ కవుల భావశక్తి వుంది; గురజాడ సాంఘిక దృష్టి వుంది. మార్క్స్, ఎంగెల్స్, మయకోవ్‌స్కీ, బెర్ట్ బ్రెక్ట్, ఎడ్గార్ అలెన్ పో, ఫ్రెంచి సింబలిస్టులు, సర్రియలిస్టులు, స్విన్ బర్న్, ఇలియట్ — ఇంకా ఎందరెందరి ప్రభావమో అతనిపై వుంది.

ఇందరి ప్రభావాలను అతడు గుండిగలో పోసి వండిన కవిత్వం తెలుగు దేశం మీద తుపానులా వ్యాపించి, తుపాకులు పేల్చి, సంక్షోభం పుట్టించింది పాతదన్న ప్రతిదాన్ని డొక్క చించి డోలుకట్టి వాయించాడు. ఆ డోలు తాళానికి సరిపడే ఛందస్సును సృష్టించుకుని, కనీసం తెలుగులో, ఇంతవరకెవ్వరు తొంగిచూడని అగాధాలను వర్ణించాడు.

శ్రీశ్రీ ఒక అపకారం చేయక పోలేదు. తన తరవాత మరోలా రాయడానికి వీలులేకుండా చేశాడు. తనలా వ్రాసినవన్నీ తెలుగు కవితకు శుష్కాలంకారాలు కూడా కాలేకుండా చేశాడు. తన మార్గం అనితర సాధ్యమే కాదు, తనకైనా సాధ్యం కాకుండా చేసుకున్నాడు. ఈ లోగా ప్రపంచం తెలుగు కవిత్వంలోని ఈ స్తబ్దతను, శ్రీశ్రీని, అతని అనుయాయులను, కమ్యూనిజాన్ని దాటి, తెలియని ఏ నిజం వైపో ఎదిగిపోతోంది.

— సవ్యసాచి